సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



వాగులు దాటాలంటే వణుకే

వర్షాకాలం వస్తే చాలు.. ఏజెన్సీ ప్రాంతంలో కొండవాగులు బుసలు కొడుతూ ప్రవహిస్తూ ఉంటాయి. వాగు దాటాలంటే ప్రజలు వణుకుతున్నారు. 8లో ▸



డీజిల్ మాఫియా

ట్యాక్స్‌లు చెల్లించకుండా దొడ్డిదారిన అక్రమంగా డీజిల్ రవాణా చేస్తున్న ట్యాంకర్‌ను ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్‌లో పెట్రోల్ బంకు వద్ద సీజ్ చేశారు. 8లో ▸



స్మగ్లింగ్ గ్యాంగ్ అరెస్ట్

శ్రీగంధం స్మగ్లింగ్ చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌ను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. 30 శ్రీగంధం చెక్కల దుంగలు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు విభాగం, ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంటు వడ్డి రఘురాం బుధవారం కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు.

ఆందోళన బాటలో విద్యుత్ ఉద్యోగులు



జిల్లా సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం భీమవరంలోని జిల్లా సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళనలో పాల్గొన్నారు. అపరిమితమైన మెడికల్ పాలసీని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 2004 వరకూ ఉద్యోగం పొందిన వారికి జీపీఎఫ్ కొనసాగించాలని కోరారు. బకాయిపడిన కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీలపై 20న రౌండ్ టేబుల్ సమావేశం

భీమవరం: ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ.. ఈ నెల 20న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు భీమవరం మెంటేవారితోటలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు గోపాలన్ తెలిపారు.

ఆచంటలో అత్యధికంగా 120 మి.మీ. వర్షం

భీమవరం: జిల్లాలోని ఆచంట మండలంలో బుధవారం ఉదయం అత్యధికంగా 120.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సమాచారశాఖ తెలిపింది. వీరవాసరంలో 74 మి.మీ, భీమవరంలో 67.2, పెనుమంట్రలో 70.2, పాలకోడేరు 56.4, ఉండి 19.4, గణపవరం 19.4, అత్తిలి 23.4, ఇరగవరం 42.2, పెనుగొండ 67.8, పోడూరు 46.4, పాలకొల్లు 66.4, యలమంచిలి 29.4, నరసాపురం 29.4, మొగల్తూరు 4.2, పెంటపాడు 6, తాడేపల్లిగూడెం 3.4, తణుకులో 2.4, ఆకివీడులో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



ఉండిలో ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఉండి: ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ సీహెచ్ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉండి ఆర్అండ్‌బీ బంగ్లా, అక్విడెక్టు, ఇరిగేషన్ స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను సర్వే చేయించి వెంటనే సరిహద్దు రాళ్ళు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కే ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. స్థలాలు ఆక్రమణలో ఉంటే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దారు నాగార్జునకు ఆదేశాలు జారీ చేశారు.

రేపు చేబ్రోలులో జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేబ్రోలు గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 81848 87146, 7710177767 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జగన్ హయాంలోనే సాకారం

- ఏడాదిలోనే ఎంబీబీఎస్ క్లాస్‌లకు మెడికల్ కళాశాల సిద్ధం
- శాశ్వత కళాశాల పనులూ వైఎస్సార్‌సీపీ హయాంలోనే
- కూటమి ప్రభుత్వంలో పనుల జాప్యంతో క్లాస్‌లకు ఇబ్బంది
- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి సర్కారు యత్నం
- ఈ నెల 19న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

● 2024 ఎన్నికల నాటికి



ప్రభుత్వ మెడికల్ కాలేజీ శాశ్వత భవనం

● 2025 సెప్టెంబర్ నాటికి



ప్రభుత్వ మెడికల్ కాలేజీ శాశ్వత భవనం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరులో మెడికల్ కాలేజీ నిర్మించారు. మాజీ సీఎం జగన్ జిల్లా ప్రజల కలను నిజం చేస్తూ.. ప్రతి పేదవాడికి అత్యుత్తమ స్థాయి వైద్యచికిత్సలు, సేవలు అందాలనే సంకల్పంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీని తేవడమే కాదు, యుద్ధప్రాతిపదికన భవనాల నిర్మాణం చేపట్టారు. 2023 సెప్టెంబర్ 15న మొదటి ఏడాది ఎంబీబీఎస్ క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించిన భవనాల వద్ద ఇప్పుడు కూటమి నేతలు ఫొటోలు దిగుతూ ... తమ హయాంలోనే జరిగిందనే రీతిలో ప్రచారం చేసుకోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగన్ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభించి 50 శాతం పనులు పూర్తి చేయగా.. కూటమి 15 నెలల పాలనలో మిగిలిన 50శాతం పనులు నేటికీ పూర్తి చేయలేదు. మరోవైపు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి సర్కారు కుట్ర చేస్తోంది. దీనిని నిరసిస్తూ ఈ నెల 19న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నారు.

ఏడాదిలోపే భవన నిర్మాణం

2019 అక్టోబర్ 4న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జీజీహెచ్‌కు శంకుస్థాపన చేశారు. అప్పటికే అక్కడ భారీ భవనాలు ఉండడంతో ముందుగా వాటిని తొలగించారు. ఈలోగా కరోనా వైరస్ విలయంతో రెండేళ్ల పాటు కరోనాతో పనులన్నీ నిలిచిపోయాయి. అనంతరం 2022 అక్టోబర్‌లో పాత బస్టాండ్ సెంటర్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద రూ.60 కోట్లతో శరవేగంగా కేవలం ఏడాదిలోపే భవన నిర్మాణం పూర్తి చేశారు. 2023 సెప్టెంబర్ 15న ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభించారు.

కూటమి రాకతో పనుల్లో జాప్యం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మెడికల్ కాలేజీ నిర్మాణంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. కాంట్రాక్టర్‌ను తొలగిస్తారని, నిధులు విడుదల చేస్తారో లేదో అన్న సందేహాలతో పనులు నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా... నేటికీ శాశ్వత భవనం, హాస్టల్స్ భవనాలను పూర్తి చేయలేదు.

తామే కట్టామంటూ కూటమి నేతల ప్రగల్భాలు

ఏలూరు జీజీహెచ్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం వద్ద కూటమి నేతలు ఫొటోలు దిగటాన్ని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రయత్నం చేయని సీఎం చంద్రబాబు.. మాజీ సీఎం జగన్ పనులు ప్రారంభించిన భవనాల వద్ద తమ హయాంలోనే అంటూ ప్రచారం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం మూడో ఏడాది ప్రారంభం నాటికైనా పనులు పూర్తి చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

నిర్మాణాలు జగన్ హయాంలోనే..

ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు... కాలేజీ శాశ్వత భవనాలు, పరిపాలన భవనం, విద్యార్థులకు హాస్టల్స్ భవనాలు, అధునాతన బోధనాసుపత్రి(జీజీహెచ్), టీచింగ్, నాన్ టీచింగ్, నర్సింగ్ స్టాఫ్‌కు నివాసాలకు క్వార్టర్లు, అత్యాధునిక సౌకర్యాలతో ల్యాబ్‌లు, ఇలా పూర్తిస్థాయి మెడికల్ కళాశాల తీర్చిదిద్దేందుకు రూ.525 కోట్లు నిధులను మంజూరు చేయించారు. ఏలూరు జీజీహెచ్‌లో శాశ్వత మెడికల్ కాలేజీ భవనం, వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాల నిర్మాణ పనులను 2023 జనవరిలో ప్రారంభించారు. ఈ భవనాలను యుద్ధప్రాతిపదికన 2024 సెప్టెంబర్ కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024 జూన్ 4 నాటి వరకూ పనులు శరవేగంగా సాగాయి.

జగన్‌తోనే సాధ్యమైంది



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైంది. కూటమి ప్రభుత్వంలో ఏం అభివృద్ధి పనులు చేశారో చెప్పాలి. 2023 జనవరిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే పనులు ప్రారంభించారు. శరవేగంగా పనులు చేస్తూ ఎన్నికల ఫలితాల నాటికి 50 శాతం పనులు పూర్తి చేశారు. కూటమి నేతలు తమ ప్రభుత్వం భవనాలు కట్టిందని చెప్పుకోవటం విడ్డూరంగా ఉంది.

– గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు

హాస్టల్ నిర్మాణం పూర్తిచేయాలి



జీజీహెచ్‌లో వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి. అనేక రాష్ట్రాల నుంచి ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వైద్య విద్యార్థులు అడ్మిషన్స్ కోసం వస్తారు. సరైన సౌకర్యాలు లేకుంటే రాష్ట్రం పరువు పోతుంది. కూటమి ప్రభుత్వం ఇతరులు చేసిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవటం హాస్యాస్పదం.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

మాజీ మంత్రి కారుమూరి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కచ్చితంగా అడ్డుకుని తీరుతామని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి నిర్మాణాల్లో ఉండగా నేడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఆ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కేబినెట్‌లో ఆమోదం తెలపడం దుర్మార్గమని మండిపడ్డారు. తణుకులో ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై కూటమి విధానాలను ఎండగట్టారు. పేదలకు ఖరీదైన వైద్యం సత్వరమే ఉచితంగా అందించి వైద్యాన్ని చేరువ చేయాలని ప్రైవేటు కళాశాలలు తెచ్చి అందుబాటులోకి తీసుకొస్తే నేడు చంద్రబాబు ప్రైవేటీకరణకు తెరతీయడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని కుంటుపరచి, నేడు పేద వర్గాలను ప్రైవేటు యాజమాన్యాలకు తరలించాలనే ఉద్దేశంతో ఉన్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల 90 శాతం పనులు పూర్తయి భవనాలు ఉండగా అసలు మెడికల్ కళాశాలలే కట్టలేదని కేవలం ఊసలతోనే ఉన్నాయని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందన్నారు. మెడికల్ కళాశాలల వల్ల మెరుగైన వైద్యసేవలు పేదవర్గాలకు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలన్నీ ప్రభుత్వం ద్వారానే నడపాలనేదే తమ నినాదమని, ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకాన్ని కుంటుపరచి బీమా అంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోను మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను ఒప్పుకోమని, ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, వీరమల్లు ఫణీంద్ర కుమార్, షేక్ జిలానీ, వై.రామకృష్ణ, పైడి సాయిసూర్య, ఎడ్వర్డ్ పాల్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై 19న ఆందోళన



రాయలంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సందీప్

భీమవరం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అడ్డుకుని తీరుతుందని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ స్పష్టం చేశారు. భీమవరం మండలం రాయలంలోని నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు నివాసంలో బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. మెడికల్ కళాశాల ద్వారా అనేక మంది పేదలు వైద్యవిద్య నభ్యసించే అవకాశం లభించడమేగాక పేదలకు సత్వరంగా మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశముందని ప్రభుత్వ నిర్ణయం కారణంగా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావడమేగాక పేదలకు మెరుగైన వైద్యం దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు ఈ నెల 19న పాలకొల్లు నియోజకవర్గంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల వద్ద పార్టీ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రక్తపు మడుగులో బాలుడు



తీవ్ర గాయాలతో ఉన్న బాలుడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించిన హైవే పోలీస్ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు శివారు కలపర్రు జాతీయ రహదారికి వెళ్ళే ప్రధాన రహదారిపై పొలాల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని గుర్తించిన సమీపంలోని రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ బాలుడిని అంబులెన్స్‌లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాలుడు అపస్మారక స్థితిలో ఉండడంతో వివరాలు తెలియవని పోలీసులు చెబుతున్నారు. బిఆలుడి తల, చెవుల పక్కన తీవ్ర గాయాలున్నాయి. కత్తితో, పదునైన చాకుతో పొడిచి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఏకంగా పదికి పైగా కత్తిపోట్లు ఉన్నాయని చెబుతున్నారు. బాలుడి వయసు 14 నుంచి 15 ఏళ్ల ఉంటుందని, ఖాకీ రంగు నిక్కరు, ఎరుపు టీషర్ట్ వేసుకుని ఉన్నాడనీ, వివరాలు తెలిస్తే.. 9440796637 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పెదవేగి సీఐ రాజశేఖర్, పెదపాడు ఎస్ఐ సంఘటనా స్థలంలో పరిస్థితులను పరిశీలించారు. ఎవరైనా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకొచ్చి కత్తితో పొడిచి పారిపోయారా? అనే అనుమానం వ్యక్తమవుతోంది.

నిలకడగా గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద ఎగువన పెరుగుతూ, దిగువన తగ్గుతూ ఒకేలా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి వరద బుధవారం ఉదయం తగ్గినప్పటికీ, తిరిగి రాత్రికి 35.90 అడుగులకు చేరుకుంది. దిగువన పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 6.61 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. స్పిల్ వే వద్ద 31 మీటర్ల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. వరద తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతోంది.

19న నియామక పత్రాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 19న నియామక పత్రాలు అందచేయనున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులందరూ అమరావతిలో జరిగే నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

రోడ్డెక్కిన దస్తావేజు లేఖర్లు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖర్లు

పెదవేగి: తమ సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కనున్నట్టు దస్తావేజుల లేఖర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆయన నేతృత్వంలో జిల్లా స్థాయి లేఖర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ వ్యవస్థను రద్దు చేయాలని, వీలునామాలు రాయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి నేరుగా అక్కడే రిజిస్ట్రేషన్ చేసుకునేలా అనుమతి కల్పించాలని, ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఇచ్చే గ్రాంట్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. దస్తావేజు రాసుకున్న వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం 72 గంటలు సమయం వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. పెన్‌డౌన్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 294 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దస్తావేజు లేఖర్లంతా శుక్ర, శని వారాల్లో నిర్వహించే పెన్‌డౌన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టైలర్లకు చేదోడుగా నిలవాలి

- ఆటో డ్రైవర్లకు ఇస్తున్నట్లే రూ.15 వేలు అందించాలి
- టైలర్ల డిమాండ్



తాడేపల్లిగూడెం ప్రకాశం మున్సిపల్ మార్కెట్‌లో టైలరింగ్ షాపులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత ప్రభుత్వంలో చేదోడు పథకంలో ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేల చొప్పున నాలుగేళ్లు అందజేశారు. తమకు కూడా చేదోడు పథకం తరహాలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా టైలరింగ్ స్కీంను అమలు చేయాలని, టైలర్స్‌కు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హత కలిగిన దర్జీలకు వారి వ్యాపార ఉన్నతికి, పరికరాల కొనుగోలు నిమిత్తం చేదోడు పేరుతో ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. నాలుగేళ్ల పాటు ఈ పథకం అమలు చేశారు. ఐదో సంవత్సరం ఎన్నికల కోడ్ కారణంగా అమలు చేయలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో రూ.15 వేలు ఆటో కార్మికులకు అందిస్తున్న నేపథ్యంలో టైలర్లకు కూడా రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు

ఇప్పటికే టైలర్లు వృత్తిపరంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. రెడిమేడ్ వస్త్రాలతో వారికి పనిలేకుండా పోతోంది. గతంలో టైలరింగ్ షాపులలో యాజమానితో పాటు పనివారు ఉండేవారు. నేడు ఎవరికీ పనులు లేకపోవడంతో టైలర్లు ఆర్థికంగా చితికి పోతున్నారు. నాడు రద్దీగా ఉండే టైలరింగ్ షాపులు వారికి నేడు పని లేకుండా పోవడంతో టైలర్స్ ఆర్థికంగా చితికిపోయారు. టైలర్స్‌కు పనులు లేకపోవడంతో షాపులకు అద్దెలు చెల్లించలేకపోతున్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల్లో రాయితీలు ఇవ్వాలని, ప్రభుత్వ షాపుల్లో తక్కువ అద్దెకు టైలర్లకు షాపులు కేటాయించాలని, ఎక్కడైనా టైలర్లకు ఇచ్చిన ప్రభుత్వ షాపులు పాడైతే వాటికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

టైలర్లను ఆదుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమం అందజేసింది. టైలర్లు, కుమ్మరులు, రజకులు, ఆటోవారికి, నాయీ బ్రాహ్మణులకు ఆర్థిక సాయం చేశారు. నేటి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసి టైలర్లకు, చేతివృత్తిదారులకు కూడా సాయం ప్రకటించాలి.

– చింతకాయల సత్యనారాయణ, సీనియర్ టైలర్, తాడేపల్లిగూడెం

ఆటో కార్మికుల్లాగానే సాయం ప్రకటించాలి



గత ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకుంది. నేటి ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం ప్రకటించాలి. నేడు ఆటో కార్మికులకు సంక్షేమం అందజేసేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో టైలర్లకు కూడా సాయం ప్రకటించాలి. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలి

– టి.సుబ్రహ్మణ్యం, టైలర్, తాడేపల్లిగూడెం

పేద టైలర్ల సంగతేంటి?



గత ప్రభుత్వ హయాంలో 2 సార్లు రూ.10 వేలు సాయం అందుకున్నాను. ప్రస్తుత ప్రభుత్వం కూడా పేద మహిళా టైలర్లను ఆదుకోవాలి. ఈ ప్రభుత్వం ఇంతవరకు టైలర్ల సంక్షేమానికి ఎలాంటి ప్రకటన చేయలేదు. కార్పొరేట్ శక్తులు కారణంగా మహిళా టైలర్లు చితికిపోతున్నారు.

– ఎస్.కృష్ణవేణి, మహిళా టైలర్, తాడేపల్లిగూడెం

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ చాంబర్ నుంచి రీ సర్వే, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, పీజీఆర్ఎస్ ఇళ్లు, స్థలాలు, అన్నదాత సుఖీభవ, వివిధ రెవెన్యూ అంశాలపై రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదుదారులతో అధికారులు స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సివిల్ కేసులు ఉంటే ఆర్డీవో స్థాయిలో ప్రత్యేక కోర్టు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫస్ట్ ఫేజ్ రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటి స్థలాలకు వచ్చిన దరఖాస్తులును విచారణ నిర్వహించి, తనిఖీ కోసం సంబంధిత ఆర్డీవోల ద్వారా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. స్వచ్ఛోత్సవ వాల్ పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ భారత్ మిషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారని అన్నారు.

క్లుప్తంగా

ఆక్వా దుకాణాలపై విజిలెన్స్ దాడులు



కైకలూరులో పట్టుబడిన ఎరువులతో విజిలెన్స్, వ్యవసాయాధికారులు

కైకలూరు: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం కైకలూరులోని ఆక్వా ఎరువులు, మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. సంతమార్కెట్ వద్ద ఏ టూ జడ్ ఆక్వా రైతు బజార్, వాసవి ఆక్వా రైతు బజార్‌లలో తనిఖీ చేయగా రెండింటిలో రూ.1,45,260 విలువ కలిగిన 10.800 టన్నుల ఎరువుల్లో వ్యత్యాసం గుర్తించారు. ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, ఏవో ఎ.మీరయ్య, ఎస్సై రంజిత్ కుమార్, వ్యవసాయశాఖ కైకలూరు సబ్ డివిజన్ ఏడీఏ ఏ.పార్వతి మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్ దివ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

పాలకోడేరు : బాలుడి మృతదేహాన్ని వేండ్ర రైల్వే స్టేషన్ సమీపంలో అట్టల ఫ్యాక్టరీ ఎదురుగా గోస్తనీ డ్రెయిన్‌లోని డొంకల్లో మంగళవారం గుర్తించారు. వేండ్ర అగ్రహారం శివారు కట్టావారిపాలెం గ్రామానికి చెందిన బొక్కా శ్రీనివాసరావు కుమారుడు జైదేవ్ (7) ఆదివారం సాయంత్రం సైకిల్ తొక్కుతుండగా చైను తెగిపోవడంతో దానిని పెట్టుకునే క్రమంలో గోస్తని డ్రెయిన్ వంతెనపై నుంచి జారి గల్లంతయ్యాడు. అప్పటినుంచి పోలీసులు, స్థానికులు, కాకినాడకు చెందిన ఎస్‌డీఎఫ్ బలగాలు గాలిస్తున్నారు. వేండ్ర రైల్వే స్టేషన్ సమీపంలో అట్టల ఫ్యాక్టరీ ఎదురుగా గోస్తనీ డ్రెయిన్‌లో డొంకలను కూలీలు బాగుచేస్తుండగా మృతదేహాన్ని గుర్తించడంతో ఎస్‌డీఎఫ్ బలగాలకు సమాచారం అందించారు. వారు బాలుడి మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై మంతెన రవివర్మ తెలిపారు.

వీధికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు



కుక్క దాడిలో గాయపడిన బాధితుడు

చింతలపూడి: వీధి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలైన ఘటన చింతలపూడి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆవరణలో ఒక వీధి కుక్క విద్యార్థులను కరిచే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న ఓ వ్యక్తి అడ్డుకోవడంతో అతడ్ని గాయపరిచింది. స్థానికులు ఆ కుక్కను తరమడంతో పారిపోయే క్రమంలో ఒక ట్రాక్టర్ డ్రైవర్ని, ఒక వెల్డింగ్ పని చేసే కార్మికుడిని కరిచి గాయపరిచింది. కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను కరుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఆగిరిపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఈదులగూడెంకి చెందిన ఈర్ల దుర్గారావు(42) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఇటీవల ఆర్థిక బాధలు ఎక్కువ కావడంతో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుమార్తె చుట్టుపక్కల వాళ్ల సహాయంతో దుర్గారావును నూజివీడు అమెరికన్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్షరమే ఆయుధం

నియంతృత్వ పాలనకు నిదర్శనం



రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం దారుణంగా అణచివేస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కూటమి నాయకులు రాజ్యాంగ విలువలకు బీటలు తీస్తున్నారు. తక్షణమే సాక్షి యాజమాన్యం, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలి. విలేకరులపై దాడులు, ఎడిటర్లపై అక్రమ కేసులు కూటమి సర్కార్ నిరంకుశత్వానికి, నియంతృత్వ పాలనకు నిదర్శనం.

– చినమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త

కేసులు ఉపసంహరించుకోవాలి



పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోంది. పత్రికల్లో వచ్చే కథనాలపై ప్రభుత్వం వివరణ ఇచ్చుకోవాలి. నిజాలు నిర్భయంగా రాస్తున్న సాక్షి పత్రికపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా పాత్రికేయులపై కేసులు బనాయించడం హాస్యాస్పదం. పాత్రికేయులను భయభ్రాంతులకు గురిచేయడం కూటమి ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనం. పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి

వాగులు దాటాలంటే వణుకే..

- వర్షాకాలంలో ఏజెన్సీలో పొంగుతున్న కొండకాల్వలు, వాగులు
- పలు గ్రామాల్లో బ్రిడ్జిలు లేక ఆదివాసీల అవస్థలు
- మృత్యువు పొంచి ఉన్నా.. వాగులు దాటేందుకు సాహసం
- గిరిజన సమస్యలను పట్టించుకోని పాలకులు, అధికారులు



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (ఫైల్)



ఇప్పలపాడు సమీపంలో పొంగుతున్న వాగును దాటే ప్రయత్నం చేస్తున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఏజెన్సీప్రాంతంలోని గిరిజనులు భయం నీడలో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. ఎత్తయిన కొండలు, దట్టమైన అటవీప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో అత్యధికంగా వర్షాలు కురుస్తూ ఉంటాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా కొండవాగులు బుసలు కొడుతూ ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటాయి. వాగులపై బ్రిడ్జిల నిర్మాణం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో గిరిజనులు నిత్యావసర పనుల నిమిత్తం పొంగుతున్న వాగులను దాటాల్సిందే. ఆ సమయంలో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఈ వాగులు దాటే ప్రయత్నం చేసినవారిలో అనేక మంది మృత్యువాత పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగులు దాటేందుకు గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు.

మన్యంలో వాగుల గండాలు

మన్యప్రాంతంలోని అనేక ప్రాంతాల్లో అనేక వాగు గండాలు ఉన్నాయి. వాటిని దాటి వెళ్లాలంటే ఎంతో సాహసం చేయాల్సిందే. ముఖ్యంగా గురుగుమిల్లి నుంచి చింతకొండ వాగు, అదేవిధంగా రెడ్డికోపల్లి, వీరన్నపాలెం వాగు, ముంజులూరు వెళ్లే జారుడు కాల్వ వాగు, ఇప్పలపాడు సమీపంలోని జల్లేరు వాగు, రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగు, రామారావుపేట సెంటర్ నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న జల్లేరు వాగు, కేఆర్‌పురం తూర్పు, పడమర వాగులు బుట్టాయగూడెం శివారులో ఉన్న అల్లికాల్వతోపాటు అనేక వాగులు ప్రతి ఏటా ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. అలాగే గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే మార్గంలో ఒకేవాగు మూడు ప్రదేశాల్లో ఎదురవుతూ ఉంటుంది. వీటిని దాటాలంటే సాహసం చేయాల్సిందే. రెడ్డిగణపవరం, ఇప్పలపాడు, కేఆర్‌పురం, కన్నాపురం సమీపంలోని పడమర కాల్వ, అల్లికాల్వలతోపాటు చింతకొండ, వీరన్నపాలెం కాల్వలపై అత్యవసరంగా బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

నాలుగు బ్రిడ్జిలు నిర్మించిన వైఎస్సార్

ఏజెన్సీప్రాంతంలో వాగుల ప్రవాహానికి అనేక మంది మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిని నివారించేందుకు గతంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో సుమారు రూ.26 కోట్లతో గాడిదబోరు, నందాపురం, రెడ్డిగణపవరం, రౌతుగూడెం, పడమర రేగులకుంట గ్రామాల్లోని మార్గాల్లో హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించారు. వీటి నిర్మాణం వల్ల ఆయా గ్రామాల మధ్యలో రాకపోకలు సులభతరమయ్యాయి.

కొండ కాల్వలపై బ్రిడ్జిలు నిర్మించాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రజలు తమ నిత్యావసర పనులమీద వాటినే దాటే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. కొండకాల్వలు ప్రవహించే ప్రధాన రహదారిపై హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

– కారం రాఘవ, న్యూడెమోక్రసీ నాయకుడు, అలివేరు

జల్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



రెడ్డిగణపవరం నుంచి బుట్టాయగూడెం వెళ్లే మార్గంలో ఉన్న జల్లేరువాగు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. బిక్కుబిక్కుమంటూనే ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. ఈ మార్గంలోనే స్కూల్ బస్‌లు సైతం తిరుగుతున్నాయి. పై హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలి.

– కోర్సా జంపాలు, మాజీ సర్పంచ్, రెడ్డిగణపవరం

మాజీ సర్పంచ్ ఇంట్లో భారీ చోరీ



మాజీ సర్పంచ్ కర్రి కమలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న నరసాపురం డీఎస్పీ శ్రీవేద

పెనుమంత్ర: మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామంలో మాజీ సర్పంచ్ కర్రి కమల ఇంట్లో మంగళవారం సాయంత్రం భారీ చోరీ జరిగింది. వివరాల ప్రకారం బీజేపీ యువ మోర్చా నాయకుడు కర్రి బ్రహ్మానంద రెడ్డి ఇంట్లో లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి అతని తల్లి కమల, భార్య జ్ఞాన చంద్రికను తాళ్లతో బంధించి అరిస్తే చంపేస్తామని బెదిరిస్తూ ఇంట్లో ఉన్న సుమారు 30 కాసుల బంగారం, లక్ష రూపాయలు పైగా నగదును అపహరించారు. బ్రహ్మానంద రెడ్డి కుమార్తె ట్యూషన్‌కి వెళ్లి తిరిగి వచ్చే సమయానికి నాన్నమ్మ కమల, తల్లి జ్ఞాన చంద్రిక కట్లతో బంధించబడి ఉండటాన్ని గమనించి కట్లను తొలగించింది. అప్పటివరకు వారి ఇరువురు బయటికి రాలేకపోవడంతో చోరీ జరిగిన విషయం బయట వ్యక్తులు ఎవరికీ తెలియరాలేదు. ఈ ఘటనపై బ్రహ్మానంద రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం నర్సాపురం డీఎస్పీ శ్రీ వేద, పెనుగొండ సీఐ రాయుడు విజయ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీం తనిఖీలు నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.స్వామి చెప్పారు.

శ్రీగంధం స్మగ్లింగ్ గ్యాంగ్ అరెస్ట్

- నిందితులంతా మధ్యప్రదేశ్‌కు చెందిన వారు
- రూ. 5.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



జంగారెడ్డిగూడెంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ, ఎస్సైలు, చిత్రంలో నిందితులు ముసుగు వేసుకున్న వ్యక్తులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న శ్రీగంధం చెక్క దుంగలు

జంగారెడ్డిగూడెం: శ్రీగంధం స్మగ్లింగ్ చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదివాసీ గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర వెల్లడించారు. నిందితుల నుంచి 30 శ్రీగంధం చెక్కల దుంగలు, రెండు మోటార్‌సైకిళ్లు, గొడ్డలి, రంపాలు 3, బంగారపు చైన్ 2 కాసులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి మొత్తం విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని చెప్పారు. బుధవారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు.

పగలు పూసలు విక్రయిస్తూ రెక్కీ

మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నిందితులు రోడ్డు పక్కన టెంట్‌లు వేసుకుని పగలు పూసలు, రుద్రాక్షలు విక్రయిస్తున్నట్లు నటిస్తూ రెక్కీ నిర్వహించి రైతుల పొలాల్లో శ్రీగంధం చెట్లను గుర్తిస్తారు. రాత్రి సమయాల్లో ఆ రైతుల పొలాల్లో ఉన్న శ్రీగంధం చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తుంటారు. కామవరపుకోట మండలం రత్నగిరి గ్రామానికి చెందిన రైతు తమ్మినేని సూర్యచంద్ర వరప్రసాద్ పొలంలో శ్రీగంధం చెట్లను నరుకుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. స్మగ్లింగ్ గ్యాంగ్ రైతుని బెదిరించి అతని వద్ద నుంచి రెండు కాసుల బంగారపు చైన్ లాక్కొని పోయారు. దీంతో అతను ఇచ్చిన ఫిర్యాదు, గతంలో ఆయా మండలాల నుంచి రైతులు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

శ్రీగంధం స్మగ్లింగ్ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాలపై డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం సీఐ కె.సుభాష్ పర్యవేక్షణలో తడికలపూడి ఎస్సై చెన్నారావు, జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్ జబీర్, క్రైం పార్టీ ఏఎస్సై ఎస్వీ సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎస్.రమేష్, చిట్టిబాబు, షేక్ షాన్‌బాబులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. విస్తృతంగా గాలించిన ప్రత్యేక బృందం నిందితులైన మధ్యప్రదేశ్ రాష్ట్రం కటని టౌన్, జిల్లా హర్దువా గ్రామానికి చెందిన ఆదివాసీ రాజా, ఇలాజ్‌కుమార్, జెండు, పెన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వీరిపై గత నాలుగేళ్లుగా జిల్లాలోని చింతలపూడిలో 2, కామవరపుకోటలో 2, టి.నరసాపురంలో 3, ధర్మాజీగూడెంలో 1, పెదవేగిలో 2, ముసునూరు మండలంలో 2 కలిపి మొత్తం 12 కేసులు నమోదయ్యాయి. కేసు చేధించడంలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్సైలు, సిబ్బందికి రివార్డుకోసం ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎంవీ సుభాష్, ఎస్సైలు చెన్నారావు, షేక్‌జబీర్, ఏఎస్సై ఎస్వీ సంపత్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ దేవస్థానంలో హుండీలను మంగళవారం జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో లెక్కించారు. రెండు నెలల కాలానికిగాను రూ.35,19,016, బంగారం 51 గ్రాములు, వెండి 160 గ్రాములు, 121 అమెరికా డాలర్లు, 10 కెనడా డాలర్లు వచ్చాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరావు, ప్రధాన అర్చకులు మల్లిఖార్జున శర్మ పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఎంపిక

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ విద్యార్థులు 162 మంది ప్లేస్‌మెంట్‌లు సాధించినట్లు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కృషితో అనలాగ్ డివైసెస్, సెరెమార్ఫిక్, ఒమ్ని డిజైన్ టెక్నాలజీస్, ఎఫ్‌ట్రానిక్స్ తదితర 40కు పైగా సంస్థలు క్యాంపస్ సెలక్షన్‌ను నిర్వహించాయన్నారు. ఈ ప్లేస్‌మెంట్‌లలో 162 మంది విద్యార్థులు నెలకు రూ.15వేల నుంచి రూ.1.25లక్షల వరకు స్టైఫండ్‌లతో ఇంటర్న్‌షిప్‌లను సాధించారన్నారు. వీరిలో షేక్ సిరాజుద్దీన్ రూ.1.25లక్షలు, షేక్ ఫర్మాన్ రూ.80వేలు, మహేష్, కమలప్రియ, యుగంధర్, సురేంద్రలకు నెలకు రూ.50వేలు చొప్పున స్టైఫండ్ ఇవ్వనున్నారు. అలాగే మరో ఏడుగురు విద్యార్థులకు నెలకు రూ.30వేలు, పదిహేను మంది విద్యార్థులకు నెలకు రూ.30వేల స్టైఫండ్‌కు ఎంపికయ్యారన్నారు. 14 మంది విద్యార్థులు ఐఐటీ బాంబే, మద్రాస్, హైదరాబాద్, ఇండియన్ స్టాండర్డ్స్ బ్యూరో డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లో ప్రతిష్టాత్మక పరిశోధనా ఇంటర్న్‌షిప్‌లు పొందినట్లు పేర్కొన్నారు.

డీజిల్ మాఫియా.. పట్టుబడ్డ ట్యాంకర్

- పన్నులు చెల్లించకుండా అక్రమంగా డీజిల్ రవాణా
- ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్‌లో పట్టుకున్న అధికారులు



లక్ష్మీనగర్‌లో సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్‌ను చూపుతున్న సివిల్ సప్లయి అధికారులు

ద్వారకాతిరుమల: ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకుండా దొడ్డిదారిన అక్రమంగా డీజిల్ రవాణా చేస్తున్న ట్యాంకర్‌ను పౌర సరఫరాల శాఖ అధికారులు ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్‌లోని జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద బుధవారం సీజ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ డీజిల్ మాఫియాకు సంబంధించి ట్యాంకర్ పట్టుబడటం ఇదే తొలిసారి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి లక్ష్మీనగర్‌కు ట్యాంకర్ ద్వారా అక్రమంగా డీజిల్ రవాణా అవుతున్నట్టు కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ (తాడేపల్లిగూడెం) డీపీ కిరణ్ కుమార్ సమాచారం అందుకున్నారు. ఈ క్రమంలో సిబ్బందితో కలసి ఆయన మంగళవారం సాయంత్రం ట్యాంకర్‌ను లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై వలపన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్ రాజేంద్ర ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ట్యాంకర్ యజమాని హైదరాబాద్‌కు చెందిన ఎం.రాధిక అని, అందులోని డీజిల్ ఏలూరు మండలం చాటపర్రు గ్రామానికి చెందిన కోనా శ్రీనివాసరావుదని డ్రైవర్ తెలిపాడు. అనంతరం భద్రతలో భాగంగా ట్యాంకర్‌ను లక్ష్మీనగర్‌లోని హైవే పార్కింగ్‌లో ఉన్న వెంకట దుర్గ ఫిల్లింగ్ స్టేషన్ (హెచ్‌పీ పెట్రోల్ బంకు) వద్ద నిలుపుదల చేయించారు. ట్యాంకర్‌ను తనిఖీ చేయాలని కిరణ్ కుమార్ ఏలూరు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఇమానియేల్‌ను కోరారు. అందులో భాగంగా డీఎస్ఓ ఆదేశాల మేరకు ఏఎస్‌వో ప్రతాప్‌రెడ్డి (ఏలూరు), ద్వారకాతిరుమల, భీమడోలు, జంగారెడ్డిగూడెం సివిల్ సప్లయి డీటీలు టి.నాగరాజు, ఎస్.భరత్ కుమార్, జి.వెంకటేశ్వరరావు, వీఆర్వో కొత్తపల్లి చంద్రలీల, వీఆర్ఏ కంకిపాటి నరసింహమూర్తి బుధవారం ట్యాంకర్‌ను తనిఖీ చేశారు. ట్యాంకర్‌లో 10 వేల లీటర్ల డీజిల్ విలువ రూ.9,74,200గా గుర్తించారు. ట్యాంకర్, డీజిల్ యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వానికి, కమిషనర్లకు ముందే ఫిర్యాదు

డీజిల్ మాఫియాపై స్టేట్ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ వారు ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, కమర్షియల్ ట్యాక్స్, సివిల్ సప్లయి, వెయిట్స్ అండ్ మెజర్స్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ డీజిల్ ఆయిల్ గుజరాత్ నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి వస్తోందని తెలిపారు. బంకు యజమానులు లీటర్ డీజిల్‌ను రూ.97.42లకు విక్రయిస్తే, ఈ అక్రమార్కులు రూ.75కే విక్రయిస్తున్నారు. దీంతో గడిచిన ఏడాదిలోనే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లు మేర నష్టం వాటిల్లిందని కమిషనర్లకు తెలిపారు. టాక్స్‌లు కట్టకుండా ఒక ట్యాంకర్ డీజిల్ విక్రయిస్తే రూ.5 లక్షల వరకు మిగులుతుందని, దీన్ని బట్టి అక్రమార్కులు ఏ స్థాయిలో దందా చేస్తున్నారో అర్థమవుతుందన్నారు.

అత్యవసర వైద్యం.. అందని ధైన్యం

పాలకోడేరు మండలం పెన్నాడకి చెందిన ఆరుగుల మహాలక్ష్మి అనే వృద్ధురాలికి గురువారం రాత్రి గుండె నొప్పి రావడంతో భీమవరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండెలో నీరు పట్టిందని, వెంటనే వైద్యం చేయాలన్నారు. భీమవరంలో గుండె చికిత్సకు సంబంధించి ఏ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ లేకపోవడం, దూరప్రాంతాలకు తీసుకువెళ్లే పరిస్థితి లేకపోవడంతో అదే ఆస్పత్రిలో మహాలక్ష్మికి కుటుంబసభ్యులు సొంత ఖర్చులతో వైద్యం చేయించారు.

భీమవరానికి చెందిన జి.భీమేశ్వరరావు అనే వ్యక్తికి శనివారం రాత్రి గుండె నొప్పి రావడంతో భీమవరంలో గతంలో ఆరోగ్యశ్రీ సేవలందించిన నెట్‌వర్క్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి గుండెకు సంబంధించిన సమస్య ఉందని చెప్పారు. అయితే తమ వద్ద ఆరోగ్యశ్రీ ఉచిత సేవలు లేవని చెప్పారు. భీమవరంలోని మరే నెట్‌వర్క్ ఆస్పత్రిలోనూ గుండె చికిత్సలు అందించకపోవడంతో చేసేది లేక అదే ఆస్పత్రిలో సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్నారు.

వైద్య సేవ.. అందని తోవ

- నెల రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు దూరం
- భీమవరంలో మల్టీ స్పెషాలిటీ వైద్యం నిల్
- గుండె, మెదడు వైద్యానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే..
- లేదంటే రూ.లక్షల్లో వెచ్చించాల్సిందే..
- పేదవాడి ప్రాణాలతో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు చెలగాటం



భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవాడి ఆరోగ్యానికి భరోసా లేకుండా పోయింది. అపర సంజీవని వంటి ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. భీమవరంలో ఆరోగ్యశ్రీలో మల్టీ స్పెషాలిటీ సేవలు నిలిపివేయడంతో నెల రోజులుగా భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల ప్రజలు అత్యవసర వైద్యానికి అవస్థలు పడటమే ఇందుకు నిదర్శనం. భీమవరంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గుండె, మెదడు, కిడ్నీ, వెన్నెముక తదితర సమస్యలకు సంబంధించి ఆరోగ్యశ్రీ సేవలు లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తణుకు, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

80 కిలోమీటర్ల వరకూ దూరం

భీమవరం, నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల వారికి గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి సమస్య తలెత్తితే 50 నుంచి 80 కిలోమీటర్లు వెళ్లి ఆరోగ్యశ్రీ సేవలు పొందాల్సి వస్తుంది. ఎమర్జెన్సీ కేసులు ఉంటే ప్రైవేట్ ఆస్పత్రిలో సొంత ఖర్చులు రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. ఇది పేద, మధ్యతరగతి వర్గాలకు భారంగా మారింది. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు ప్రభుత్వాస్పత్రుల్లో కూడా గుండె, మెదడుకు సంబంధించి అత్యవసర వైద్యం అందుబాటులో లేదు. తాడేపల్లిగూడెం, తణుకులో మాత్రమే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సౌకర్యం ఉంది.

ప్రజారోగ్యంపై కూటమి నిర్లక్ష్యం

భీమవరంలో నెల రోజులుగా మల్టీస్పెషాలిటీ వైద్య సేవలు నిలిచిపోయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఐదు నియోజవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు ఉన్నా సేవల పునరుద్ధరణ, ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించడం లేదు.

గత ప్రభుత్వంలో పక్కాగా అమలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిస్థాయిలో అందాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో మల్టీ స్పెషాలిటీ సేవలు ఉచితంగా అందించేవారు. కార్డియాక్, న్యూరో సమస్యలకు సంబంధించి నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండేవి. అలాగే ఆరోగ్యశ్రీలో సేవలు పొందిన వారికి ఆరోగ్య ఆసరా పేరిట నగదు సాయం కూడా అందించేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలు నిర్వీర్యం అవడంతో పాటు ఆరోగ్య ఆసరా పథకం అమలు కావడం లేదు.

అత్యవసర వైద్యం అందించాలి



ఇటీవల గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయి. వాటికి సంబంధించి సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలు పోవడం ఖాయం. అలాంటి కేసులకు భీమవరంలో ఆరోగ్యశ్రీ లేకపోవడం పేదల ప్రాణాలకు ముప్పుగా ఉంది. అనుభవం కలిగిన వైద్యులు, అధునాతన వైద్య సౌకర్యాలు ఉన్న జిల్లా కేంద్రం భీమవరంలో ఆయా సేవలను ఆరోగ్యశ్రీలో అందించాలి.

-పి.శ్రీనివాస్, కొండేపూడి

రోగి ప్రాణాలకే ప్రమాదం



పేదల ప్రాణాలను రక్షిస్తున్న ఆరోగ్యశ్రీని అందుబాటులో ఉంచాలి. అత్యవసర వైద్యం ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోతే రోగి ప్రాణాలకే ప్రమాదం. దూర ప్రాంతాలకు తీసుకువెళ్లేలోపు పరిస్థితి విషమించవచ్చు. స్థానికంగా లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకునే పరిస్థితి అందరికీ ఉండదు. ఆరోగ్యశ్రీలో మల్టీస్పెషాలిటీ వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలి.

-వి.శ్రీనివాస్, వీరవాసరం

క్లుప్తంగా

కొట్టు పరామర్శలు



వల్లూరుపల్లిలో శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలోని వల్లూరుపల్లి గ్రామంలో బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంపీటీసీ దయ్యం శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడెం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి సంపత్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం అందించాలి



విద్యార్థులకు పోషకాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

తాడేపల్లిగూడెం రూరల్: చిన్నతనం నుంచే పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. బుధవారం మండలంలోని కడియద్ద గ్రామంలో పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు నిండిన తర్వాత ఆహారాన్ని మెత్తగా గుజ్జుగా చేసి అందించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన కూరగాయలను ఆహారంలో అధికంగా తీసుకోవాలన్నారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే గుడ్లు, పాలు, బాలామృతం వంటి వాటిని తీసుకుని బలవర్ధకంగా ఎదగాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండేపాడులో తాగునీటి శుభ్రతకు చర్యలు



వెంకయ్యకాలువ నుంచి కొండేపాడు తాగునీటి చెరువుకు ఉన్న బోదెలను శుభ్రం చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని కొండేపాడు గ్రామంలో ఎంతో కాలం నుంచి వివాదాస్పదంగా ఉన్న తాగునీటి బోదెల ప్రక్షాళన చర్యలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పలువురు కూలీలు పలు ప్రాంతాలలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించారు. కాగా కొన్ని ప్రాంతాలలో సిల్ట్ తీయలేని చోట్ల ఉన్న ఆక్రమణలు కూడా స్థానికులు స్వయంగా తీసుకోని పక్షంలో చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు. వారిపై కేసులు పెట్టేందుకు వెనుకాడ బోమన్నారు. పంచాయతీ సిబ్బంది ప్రసాద్, హనుమంతు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సత్యనారాయణస్వామి

అత్తిలి: మంచిలి గ్రామంలో శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు జరిపారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాన్ని జరిపారు. గ్రామానికి చెందిన గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి వెండి సామగ్రి చోరీ చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద తాడేపల్లి గ్రామానికి చెందిన బలుసు కేశవరావు ఈ నెల 15వ తేదిన సాయంత్రం 6 గంటల సమయంలో కుటుంబంతో కలిసి ఊరు వెళ్లారు. అయితే, 17వ తేది ఉదయం 7గంటల ప్రాంతంలో కేశవరావు ఇంటి గేటు, తలుపులు తెరిచి ఉన్నాయని ఆ పక్కనే ఉన్న వారు కేశవరావు బంధువు బలుసు సంతోష్ చౌదరికి సమాచారం అందించారు. హుటాహుటీన అక్కడకు వెళ్లి చూడగా దేవుడు గదిలోని వెండి చెంబు, వెండి పళ్లెం చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ రూ.50వేలు ఉంటుందని రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సంతోష్ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకలితో అల్లాడుతున్న ఆటో డ్రైవర్లు

- ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధికి గండి
- స్వశక్తితో జీవనం సాగిస్తున్న తమను ఆదుకోవాలని డ్రైవర్ల వినతి
- కిరాయిలు లేక ఫైనాన్స్‌లు కట్టలేకపోతున్నామని ఆవేదన
- ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోలేదంటున్న వైనం
- బోణీ కాని రోజులతో అల్లాడుతున్నామంటున్న డ్రైవర్లు



తణుకులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్‌లు (ఫైల్)



తణుకులో కిరాయిలు లేక మూలకు చేరిన ఆటోలు

తణుకు అర్బన్: ఒకరిపై ఆధారపడకుండా తమ కష్టాన్ని నమ్ముకుని ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు నేడు ఆకలితో అల్లాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఆటో డ్రైవర్ల జీవన విధానాన్ని కుంటుపరిచింది. రోజంతా ఆటో నడిపితేనే కుటుంబాన్ని పోషించుకోగలమని, నేడు మహిళలంతా ఆర్టీసీ ఉచిత బస్సులు ఎక్కి ప్రయాణిస్తుండడంతో తమ ఉపాధికి గండిపడిందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం మొదలైన రోజు నుంచి మహిళలు బస్సుకోసం గంటల తరబడి వేచి చూస్తున్నారేతప్ప ఆటోలు ఎక్కడంలేదంటూ వాపోతున్నారు. బోణీ కూడా అవ్వని నేటి పరిస్థితుల్లో ఆటోలకు సంబంధించి ఫైనాన్స్‌లు ఎలా చెల్లించాలి, ఇళ్లు ఎలా గడపాలి, ఈఎంఐలు ఎలా చెల్లించాలి భగవంతుడా అంటూ ఆటో డ్రైవర్లు దండాలు పెడుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల ప్రయాణంలో మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన రద్దీతో సమయానికి గమ్యానికి చేరలేకపోతున్నామని, ముఖ్యంగా ఉదయం సమయంలో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని చెబుతున్నారు.

నిరసనలు తెలిపినా పట్టించుకోలేదంటున్న వైనం

ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమినాయకులు మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్స్ తరఫున ఉద్యమాలు, పోరాటాలు చేసినప్పటికీ తమను పట్టించుకోకుండా ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిందని ఆటోడ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు దసరా పండుగకు రూ. 15వేలు వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ రోజూవారీ కష్టంతో ఉపాధి పొందుతున్న తమకు ఏడాదికోసారి రూ.15వేలు వేస్తే ఇళ్లు ఎలా గడుపుతామని, ఫైనాన్స్‌లు ఎలా చెల్లించగలమంటూ ఆవేదన చెందుతున్నారు. ఆటోలకు మరమ్మతులు, బ్రేక్, టాక్స్‌లు ఎలా చెల్లించగలమని వాపోతున్నారు.

చదువుకుని కూడా..

మార్కెట్‌లో ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లలో ఉన్నత చదువులు చదివి కొందరు, చదువులేక గత్యంతరం లేని స్థితిలో మరి కొందరు ఆటో డ్రైవింగ్ వృత్తిని నమ్ముకుని బతుకుబండి లాగుతున్నారు. అయితే ఉన్నత చదువులు చదివి కూడా ఉద్యోగాలు దొరక్క తాము ఆటో డ్రైవింగ్ వృత్తిలో ఇమిడిపోయి తమ భార్యా, పిల్లలను పోషించుకుంటున్నామని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. తణుకు నియోజకవర్గంలో 5వేలకుపైగా ఉన్న ఆటో డ్రైవర్లు ఉచిత బస్సుతో తమ జీవనోపాధికి గండం వచ్చిందని ఇప్పుడు మరొక ఉద్యోగానికి ఎలా వెళ్లగలమని వాపోతున్నారు.

మా ఉపాధికి గండి



ఆటో డ్రైవరు వృత్తిలో స్థిరపడి ఏళ్ల తరబడి నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు పథకం మా ఉపాధికి గండి కొట్టింది. ఉచిత బస్సు మొదలైన రోజు నుంచి కిరాయిలు లేక కొన్ని ఆటోలు మూలకు చేరగా, అప్పుచేసి ఆయిల్ పోయించుకుని ఖాళీగా తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

– కొమ్మిరెడ్డి సాయి దుర్గారావు, ఆటో డ్రైవరు

ఆటో డ్రైవర్లపై పిడుగులాంటిది



ఉచిత బస్సు పథకం మా కడుపులు కొట్టింది. నిత్యం ఆటో ప్రయాణాల్లో అధికశాతం మహిళలే ప్రయాణిస్తుంటారు. నేడు బస్సుల కోసం రోడ్లపై గంటల తరబడి వేచిచూస్తున్నారే కానీ మా ఆటోలు ఎక్కేందుకు మహిళలు సిద్ధంగా లేరు. బండి తిప్పాలంటే ఆయిల్ కొట్టించాలి, ఆయిల్ పోసినా కిరాయిలు లేక ఖాళీగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మా బతుకులపై ఇలాంటి ఉపద్రవం వస్తుందని ఎన్నడూ ఆటో డ్రైవర్లు ఊహించలేదు.

– కోసూరి శ్రీను, ఆటో డ్రైవరు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఎన్నికల ముందు ఉచిత బస్సు వద్దని ఎన్నో రకాలుగా కూటమి నేతలను వేడుకున్నా మాపై కనికరం చూపలేదు. ఉచిత బస్సు ప్రవేశపెట్టిన తరువాత ప్రయాణాల్లో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. లక్షలు జీతాలు తీసుకునే వారు సైతం ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరలేకపోతున్నారు. ఆటో డ్రైవర్లకు దసరాకి రూ. 15వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆ డబ్బు మమ్మల్ని ఎంతకాలం అక్కరకు వస్తుంది. మా ఉపాధికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కంచుమర్తి విశ్వేశ్వరరావు, భారతమాత ఆటో యూనియన్ కార్యదర్శి

పట్టణంలో స్వచ్ఛభారత్ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు నేతృత్వం వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, కన్వీనర్ నరిసె సోమేశ్వరరావు, నాయకులు దువ్వా శ్రీను, కంచుమర్తి నాగేశ్వరరావు, రామగాని సత్యనారాయణ, డి.శ్రీను, ఎన్నేటి వెంకట లక్ష్మి, కచర్ల రాజా, కసిరెడ్డి నాగ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా సామూహికంగా ఎలుకలు నిర్మూలించాలి



బొంతువారిపాలెంలో పొలం పాలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా ఎలుకలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. బుధవారం అత్తిలి శివారు బొంతు వారి పాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి టికే రాజేష్ మాట్లాడుతూ రైతులందరూ అందరూ ఒకేసారి ఎలుకల మందు పెట్టడం వల్ల ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని, ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. రైతులందరూ యూరియా వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. యూరియా అధిక శాతం మొక్కకు అందకుండా వివిధ రూపాల్లో వ్యర్థంగా పోతుందని అన్నారు. రైతులందరూ నానో యూరియా పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గాయత్రి ,దుర్గ, ఏఈఓ శివశేఖర్, రైతులు పాల్గొన్నారు

కొద్దిపాటి వానకే మునక!



తణుకు ఆర్వోబీ కింది భాగంలో కోయాక్సిల్ రోడ్డుకు వెళ్లే సెంటర్‌లోని రోడ్డు దుస్థితి



తణుకు రైల్వే స్టేషన్ రోడ్డు దుస్థితి

- వర్షాలు పడితే చాలు చెరువుల్లా నీటితో నిండుతున్న గుంతలు
- ప్రమాదాలపాలవుతున్న ప్రయాణికులు
- రహదారులు అభివృద్ధి చేయాలని విన్నపాలు



తణుకు మునిసిపల్ కార్యాలయం రోడ్డులో ఏర్పడ్డ గోతులు



తణుకు రైల్వే స్టేషన్ ముందు వర్షపు నీటిలో ప్రయాణాలు చేస్తున్న వాహనదారులు

తణుకు అర్బన్: తణుకులో రహదారులు ఛిద్రమైపోయి ప్రయాణికులు ప్రమాదాలపాలవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో సైతం గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులు ప్రమాదాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గుంతల్లో వర్షపునీరు చేరి ప్రయాణికులకు తీవ్ర ఆటంకంగా మారిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా తణుకు పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు, మునిసిపల్ కార్యాలయం రోడ్డు, ఇరగవరం రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయాయని నిత్యం ఏదోక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా రైల్వే స్టేషన్‌కు వచ్చేవెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెటల్ రోడ్డులో రాళ్లులేచిపోయి నడవడం కూడా ప్రమాదంగా మారిందని వాపోతున్నారు. స్థానికంగా ఉన్న దుకాణదారులు సైతం వాహనాల టైర్లకు తగిలిన రాళ్లు దుకాణాల్లోకి వచ్చి తగులుతున్నాయని చెబుతున్నారు. రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు సైతం మీదకు చిమ్ముతున్నాయని వాపోతున్నారు. ఇక ఉండ్రాజవరం రోడ్డు, కోయాక్సిల్ రోడ్డు కూడా ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞోత్సవాలు



తణుకు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ యజ్ఞోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



తణుకులో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ స్వాముల వారి యజ్ఞోత్సవములు అత్యంత వైభవంగా ప్రారంభించారు. ముందుగా స్థానిక శుభం గ్రాండ్ ప్రాంతంలో విశ్వకర్మ పతాకావిష్కరణ ఆలయ చైర్మన్ తమిరి శ్రీనివాస్ చేతులమీదుగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన చేసి హోమం పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ ముందూరి వీరభద్రాచార్యులచే పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా కోశాధికారి కొమ్మోజు రామకృష్ణ, అధ్యక్షులు నాగమల్లి సాంబశివరావు, మందరపు నాగ మనోహర్, కోరుమిల్లి సుబ్బారావు, వెండి శ్రీను, తమిరి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని శ్రీవిశ్వకర్మ వడ్రంగి పనివారం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సొసైటీ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో విశ్వకర్మ భగవాన్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోడి నాగబాబు, సంఘ అధ్యక్షుడు కలగర్ల శేషగిరి బాబు, కార్యదర్శి కొప్పోజు కొండ బాబు, కోశాధికారి కోటపాడు కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన వేల్పూరు విద్యార్థులు



వేల్పూరులో విజేతలైన విద్యార్థులతో హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: ఈనెల 16వ తేదీన ఏలూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో తణుకు మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాధాకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థులు యు.దినేష్‌కార్తీక్, వి.నీరజ్, బి.ఆనంద రావు, జి.రాకేష్, పి.కార్తీక్ లు వివిధ విభాగాల్లో విజేతలై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 15వ తేదీన తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పి.సాహితీ ప్రియదర్శిని, బి.మోక్షానందస్వరూప్, కె.సాయి వెంకట వినాయక సాత్విక్‌లు వివిధ క్రీడల్లో రాణించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను కమిటీ చైర్మన్ పి.శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

శరన్నవరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయండి



ఆలయ కమిటీచే కరపత్రాలు విడుదల

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కడకట్ల గ్రామంలో బాలకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు భక్తులు దర్శించి, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గౌరవాధ్యక్షుడు డి.సోమసుందర్, కమిటీ సభ్యులు ధనల వెంకట్రావు, తాడికొండ శ్రీనివాస్‌లు వెల్లడించారు. కరపత్రాలు విడుదల చేశారు. 22వ తేదీన బాల త్రిపుర సుందరీదేవి, 23వ తేదీన గాయత్రిదేవి, 24వ తేదీన శ్రీ అన్నపూర్ణ దేవి, 25వ తేదీన శ్రీ కాత్యాయనిదేవి, 26వ తేదీన శ్రీ మహాలక్ష్మిదేవి, 27వ తేదీన శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 28వ తేదీన మహాచండీ దేవి, 29వ తేదీన శ్రీ సరస్వతి దేవి, 30వ తేదీన శ్రీ దుర్గాదేవి, 01వ తేదీ మహిషాసుర మర్దినీ దేవి, 02వ తేదీన శ్రీ రాజరాజేశ్వరీ దేవి విశేష అలంకరణలు చేయనున్నారు.

శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు



విశేష అలంకరణలో కృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో అజ ఏకాదశి సందర్భంగా బుధవారం స్థానిక కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకలు, సహస్రనామార్చనలు, వకుళ మాలలు, పుష్పమాలలతో అలంకరణ, నూతన పట్టు వస్త్రాలతో విశేష అలంకరణలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం



అత్తిలి: పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ నాగరాజు



తాడేపల్లిగూడెం (టీఓసీ): టీకాలను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు



పెంటపాడు: ముదునూరు ఆరోగ్యకేంద్రంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: మహిళల ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. బుధవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, క్యాన్సర్, రక్తహీనత, క్షయ, ఎనీమియా, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, పిల్లలకు టీకాలు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద నిర్వహించే వివిధ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధులను తొలి దశలో గుర్తించి మందులతో నివారణ పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, వైద్యాధికారిణి డాక్టర్ ఆర్ సురేఖ, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వేద, ఎంపీడీవో పి శామ్యూల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళారోగ్యంతోనే బలమైన సమాజం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యవంతమైన మహిళలు, శక్తివంతమైన కుటుంబాల ఏర్పాటుకు తద్వారా బలమైన సమాజ నిర్మాణానికి దోహదపడతారని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. పట్టణంలోని బీబి సెంటర్, ఎన్‌టీఆర్ జంక్షన్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం సుపోషిత్, సక్షం భారత్‌లను ప్రారంభించారు. పట్టణంలో అవగాహన ర్యాలీ జరిగింది. సెంటర్‌లో చైల్డ్ ఫీడింగ్ ప్రాక్టీసెస్ పై అవగాహన తల్లులకు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పోషకాహార పదార్థాల స్టాల్స్‌ను నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ సుధా దేవలక్ష్మి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ రాజు, గైనకాలజిస్ట్ భార్గవి, మెడికల్ ఆఫీసర్ వన్యశ్రీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్ దుర్గాభావాని, కే.విశాలాక్షిలు పర్యవేక్షించారు. అక్టోబర్–16 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవన శైలి అనే అంశాలపైన, స్థూలకాయ నివారణకు, చక్కెర, నూనె వినియోగం తగ్గించాలని, బాల్య దశ సంరక్షణ, విద్య, పోషణ, శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు పద్ధతులు నేర్పించడం, పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, సమన్వయ చర్యలు, డిజిటలీకరణ, సమగ్ర పోషణ, ఐవైసీఎఫ్ ప్రాక్టీస్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, దాట్ల జగన్నాథరాజు, మునిసిపల్ మేనేజర్ రవి సుధాకర్ పాల్గొన్నారు.

ముదునూరు పీహెచ్‌సీలో బాలికలకు వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలువులు డాక్టర్లు రోగులకు పరీక్షలు నిర్వహించారు. స్కూలు విద్యార్థినులకు ప్రత్యేకంగా రక్త పరీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళల ఆరోగ్యరక్షణ కోసం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి పూజిత తెలిపారు.

విద్యార్థులకు పథకాలు అందాలి

నరసాపురం: హాస్టల్ విద్యార్థులకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలని ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్‌వీ అరుణకుమారి అన్నారు. బుధవారం వైఎన్ కళాశాలలో ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఫలాలు అందుతున్నదీ లేనిదీ సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణ చేయాలని చెప్పారు.